కథా నిలయం
3444
శ్రీకాకుళం

# వర్షస్మృతులు

దీపావళి వస్తున్నదంటే తన మనసులో యింత కలవరం బయలుదేరుతుందేమిటి? గుండెల గుబగుబ యెంచేత? ఏమిటి తనకీ ఆవేదన, అంతులేని ఉద్వేగం? ఇకపోదా యిది, ఆజన్మాంతం తననిపట్టి పల్లార్చాల్సిందేనా? తనేంపాపంచేసిందని యీ ఘోరశిక్ష తనకి?

ఏమో తెలీదు. ఎన్ని పాపాలు చేసిందో తెలీదు. ఎందుకో కారణం తెలీకుండా కష్టాలూ మానసిక వెతలూ అనుభవించాల్సిందే. అంతే!

తనింత ఆవేదన యెందుకు పడుతున్నదీ తనకు తెలీనేతెలీదు. బొత్తిగా తెలీదు. ఇప్పటికి అయిదు సంవత్సరాలుగా ఇదేబాధ. 'దీపావళి' మాట విన్నప్పుడల్లా ఒళ్ళు గగిపొడవటం స్మృతులు బాధాయుతం కావటం జరుగుతునే వున్నది.

ఎందుకు కాదు? అతి సహజం!

జీవితంలో భాగస్వామిని కోల్పోయింది తను ఆ రోజున. ఏమీలేదు. దీపావళి పండుగ వస్తున్నదంటే హుషారుగా అందుకు తయారయే సంసిద్ధులయే కూర్చున్నారు యిద్దరూను! కాని రేపే చతుర్ధశి అనగా ఒంటికి కొంచెం వేడితగిలింది. ఏమీ పెద్ద ఉపద్రవం లేదు. మనిషి లోపల బాధపడుతున్నాడేమో కాని తనకోసం బయటికి హాయిగానే నవ్వుతూ కనిపిస్తున్నాడు. ఎన్నడూ లేని జ్వరం పండుగనాటికే తగిలిందే అని తనకి బెంగ. అబ్బ! ఎంతబుజ్జగించి చెప్పాడు తనకి. 'వట్టి జ్వరానికే యింత కలవరపడితే యెలాగు, ఇవాళవున్నది రేపటికి తగ్గిపోతుంది. నిన్నవున్నది తనుకనా? మనస్సులో యేమీ భయపడకు. అందులో పండుగరోజులు కూడాను' అన్నాడు. ఆ నాలుగు మాటలూ తనకు యీ నాటికి కూడా అచ్చం అతని నోటిలోంచి వచ్చిన తీరుగానే జ్ఞాపకం. అట్లానే జీవితాంతం వరకూ కూడా వుంటాయా? ఉంటే తనకు ఆవేదన??

ఆని తనకి మనసులో భయంమాత్రంవదలదు. అంటే జరిగిన ప్రమాదం జరగనున్నదని తనకు ముందుగా తెలిసివుండి కాదు, యేదో అస్పష్టభీతి, అవ్యక్తవేదన పూరికే మనసులో బెంగరేపి బెదురు కలిగించేందుకు. తననితానే వూరడించుకుందామని యెంత ప్రయత్నించినా బాధ తగ్గదు. అయినా అతను నవ్వుతోంటే తనని నవ్విస్తోంటే మనసుదాచుకుని అతనికోసం అన్నట్టు! యేవిటో? యేమిటో!!

మరునాడు జ్వరం ఉదయం కొంత తగ్గినట్టు అనిపించింది. కాని మధ్యాహ్ననికల్లా మళ్ళీ పెద్దదయిపోయింది. ఒట్టిజ్వరం! ఇంకేమీ యితర "సింప్టమ్స్" లేవు. అయినప్పటికి పండగనాటికి ఉధృతం అయిచూస్తూ వుండగానే అతని పంచప్రాణాలూ అనంతవాయువుల్లో లీనమైపోయినాయి. అంతా తనకళ్ళముందే జరిగింది! ఏమేమనుకున్నారు; ఎంత ఆహ్లాదంగా గడిచిపోతుందని ప్లానులు వేసుకున్నారు. అంతా ప్రేతభూమి అయికూర్చుంది.

అతను - రాఘవరావు -తన జీనితాన్ని ఎంత పులకితంజేసినాడు! అసలు తను యెవరు? తన జీవితానికి రాఘవయేవరు? ఎట్లాకుదిరింది యిద్దరికీ?

పదేళ్ల కిందట యిద్దరూ ఒకేవూళ్ళోవుండటం, చిలికిచిలికి గాలివానయినట్టు ప్రధమ పరిచయం లగాయితు యెంతో ప్రేమ, ఆరాధన బయలుదేరి ఒకనాడు తను వుద్రేకం పట్టలేక "యెన్నాళ్ళు కాకి బతుకు, యేకాకి బతుకు?" అనడం ఎట్లామరచిపోతుందితను? మనం అనుకున్న వన్నీ అనుకున్నట్లుగా నెరువేరుతాయా?

తనేమీ చెయ్యలేదు. దేని ఫలితమో, 'రాఘవ' పోయినాడు.

అవును అతను చనిపోయాడని దిగులుచెంది తను యింట్లోకూర్చుంది. ఏడుపు. ఒకటేధార. ఏమిటిదారి? తన కర్తవ్యం యేమిటి? ఏం చెయ్యాలితను? ప్రకాశంవచ్చి పలకరించకపోతే తన గతియేమయేదో. అతను, "పాపం, ఎక్కువగా మనసులో విచారం పెట్టుకోకండి" అన్నాడు. అంతకన్నా యేమంటారు? కాని తనకి విచారం అంతరించదు.

"ఏంచేస్తారు మీరు? ఎక్కడికి వెళతారు?" అనడిగాడు ప్రకాశం తనని. అతనికి తెలీదు యెట్లాంటి పరిస్తితుల్లో రాఘవా తనూ యిక్కడ వుంటున్నది.

"మీనాన్నగారెక్కడ?"

చెప్పింది తను.

"నేను రాయనా?"

"ఊహూ"

అతనికి తెలీదు తమ కలయిక తన తండ్రికి యిష్టం కాని పరిస్థితుల్లో జరిగిందని. రాఘవకి యెవరూ లేరు. దిక్కులేనివాడు. అల్లాంటివాడు తన కూతురికి తగునా? తన తండ్రిమాట కాదని రాఘవతో కలిసి పోయింది. ఇద్దరు కాదు, ఒక్కటే స్వరూపం రాఘవా తనూ. కాని రాఘవ విధికృతంచేత తన్ను వొదిలి – ఇప్పుడు తనొక్కతే!

చంద్రుడు ఆకాశంలో తారట్లాడుతూండగా తారకలు తిరుగుతూండగా వెన్నెల దిక్కులేకుండా కాస్తూండగా కథంతా ప్రకాశంతోచెప్పుకుని యేడుస్తోంది. ప్రకాశానికి అంతా ఆశ్చర్యం.

"నాకు తెలియదు. ఎన్నడూ రాఘవ చెప్పాడు కాదు" అంటాడు.

"అవును చెప్పడు. అతి గంభీరం – అతనికి"

"ఇప్పుడు యేమిటీ" యేదో అంటాడు ప్రకాశం, అతని గొంతులో మాట గొంతు తడబడి మాట బయటికి రాదేం?

"ఏ ముఖం పెట్టుకొని మా నాన్న దగ్గరికి వెళ్ళను?"

"వెళ్ళొద్దు"

వెళ్ళక తను చేయగలదేమిటి? తనకీ యిష్టం లేదు కాని వెళ్ళాలి. తండ్రిరానిస్తాడా, రానివ్వకపోతే? ఏమా తోచదు తనకి!

ఏమైనా "వెళ్ళొద్దు" అంటాడు ప్రకాశం

"ఏం చెయ్యను?"

"ఏంచేస్తారు?" అనడుగుతాడు తననే!

"అనాధని"

తరువాత యేంజరిగిందో, యేం మాట్లాడుకున్నారో తెలీదు తనకి, ప్రకాశానికి కూడా తెలీదు కాబోలు. గుర్తురాదు యెంతప్రయత్నించినా గాని.

మళ్లీ తన జీవితానికి ఆనందం – ప్రకాశంచాటున వికాసం బయలుతేరుతాయి. అట్లా అనుకుందా తను యెన్నడయినా? కాదు, అనుకోనివే జరుగుతాయి, వాంఛించినవి జరగవు! ఈ మనుషులు నివసించే ప్రపంచంలో.

అప్పడే అయిదు సంవత్సరాలు గడిచినాయి, ప్రకాశం తనని చేపట్టి. అంతా గుర్తువచ్చినప్పుడు క్షణం కిందటో అరక్షణం కిందటో జరిగినట్టుంటుంది. అబ్బ! ఎంత మధురం – రోజులు!

కాని, దీపావళివస్తున్నదంటే – వచ్చేస్తున్నదంటే – విషాదం తనని కమ్మేస్తుంది. ఇతరరోజుల్లో తనకి జరిగిన యీ అనుభవాలు గుర్తువుండవు, ఆ ఆనందంలో ప్రకాశం గుర్తుకి రానియ్యడు. దీపావళి వస్తుందనగా వారంరోజులూ, గడిచినమీదట వారం రోజులూ తనకీ ప్రకాశానికి యేమీతోచదు. ఏమీతెలీదు. చచ్చిపోయిన రాఘన ముందు తామిద్దరూ యెవరు? ఎవరు కోరారు తమ జీవితాలు కలిసి ఒకేబాటలో నడవాలని?

ఐతే రోజులు దొర్లుకుపోతూనే వున్నాయి. జీవితంలో గతించిన స్మృతులు అట్లా హృదయాల్లో తొలిచినట్టు నిలిచిపోతున్నాయి. దేనికీ యెవరూ బాధ్యులు కారు.

*

*(తెలుగు స్వతంత్ర 20-2-1953)*